## క్లుప్తంగా

### అమ్మవారిని దర్శించుకున్న పెడన ఎమ్మెల్యే



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారిని ఆదివారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించి మొక్కులు తీర్చుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు ఆయనను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### జేఈఈ ఫలితాల్లో శారద విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జేఈఈ-2024(అడ్వాన్స్‌డ్) ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి ఉత్తమ ర్యాంకులు సాధించారని శారదా విద్యాసంస్థల చైర్మన్ వై.రమేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగిన జేఈఈ-2024(అడ్వాన్స్‌డ్)లో ఎ.సంపత్(729), కె.నాగరాహుల్ ధృవ(3,670), ఎం.నాగలక్ష్మి లలితాదేవి(5,366), పి.పవిత్ర(5,544), పి.వెంకటఫణికుమార్(7,689)ర్యాంకులు పొందారన్నారు. జేఈఈ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి ర్యాంకులు పొంది జాతీయ విద్యాసంస్థలో సీట్లు పొందుతున్నారని తెలిపారు. ఈ విధమైన ర్యాంకులు సాధించడానికి చక్కని ప్రణాళిక, అధ్యాపకుల సలహాలు సూచనలు, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం ఎంతో ఉందన్నారు. తమ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని శారదా విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి పేర్కొన్నారు. తమ విద్యా సంస్థలలో చదివే ప్రతి విద్యార్థి కూడా అన్ని జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని తెలిపారు. పరిమితమైన విద్యార్థులతో ఈ స్థాయిలో ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. జేఈఈ-మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌తో పాటు జాతీయ స్థాయిలో జరిగే ఇతర అన్ని ప్రవేశ పరీక్షల్లో కూడా సీటు పొందేలా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని కళాశాల సలహాదారుడు ఈఎస్ఆర్‌కే ప్రసాద్, విద్యాసంస్థల జనరల్ మేనేజర్ జీవీ రావు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యంతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.

### మానవ సేవే మాధవ సేవ



మధురానగర్(విజయవాడసెంట్రల్): మానవ సేవే మాధవ సేవ అని ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని తోటివారికి సాయం చేయాలని వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ సూచించారు. దుర్గాపురంకు చెందిన బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు వీరంకి గోకర్ణేశ్వరరావు ఆధ్వర్యాన ఆదివారం వృద్ధులకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో బ్రహ్మదేశం వసంతకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆకలితో ఉన్న వారి కడుపు నింపడంలో ఉన్న తృప్తి మరెందులోనూ లభించదని అన్నారు. ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన గోకర్ణేశ్వరరావును స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. అనంతరం మాతృదేవో భవ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ రీజినల్ కార్యదర్శి కొండాయగుంట రాము, జోన్ కార్యదర్శి గుర్రం ఏడుకొండలు, రాజారావు, ఆశ్రమ నిర్వాహకులు దుర్గ, జ్ఞానేంద్ర, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

### మైనర్ అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మైనర్ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టి గారి పార్కు ప్రాంతంలో చనుమోలు శ్రీను కుటుంబం నివాసం ఉంటోంది. శ్రీనుకు ముగ్గురు సంతానం. కుమార్తె 7వ తరగతి వరకు చదివి ఇంటి వద్దే ఉంటుంది. శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. దీంతో చుట్టు పక్కల వారిని ఆరా తీయగా ఓ ఆటోలో వెళ్లినట్లు చెప్పడంతో ఆందోళన చెందిన శ్రీను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### రెండు కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఉంగుటూరు: మండలంలో ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లోని అబ్దుల్ కలాం నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఈ నెల 17 నుంచి ప్లంబింగ్, శానిటరీ ఫిట్టింగ్, కార్ రిపేర్‌పై శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18-35 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వారు అర్హులని చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు వివరించారు.

# తగ్గనున్న మిర్చి సాగు

- ఏటా పెరుగుతున్న పెట్టుబడులు
- గతేడాది తగ్గిన దిగుబడులు
- పత్తి పంట వైపు రైతుల మొగ్గు



మిరప పంట(ఫైల్)

వత్సవాయి: వాణిజ్య పంటలలో ప్రధానమైన మిర్చి పంట సాగుపై రైతులు విముఖత చూపిస్తున్నారు. మిర్చి సాగు చేపట్టాలంటేనే రైతులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. గతేడాది మిర్చి రైతులు ఆర్థికంగా నష్టపోవడంతో ఈ ఏడాది సాగు చేపట్టేందుకు వెనకంజ వేస్తున్నారు. దిగుబడులు తగ్గడం, పెట్టుబడులు అమాంతం పెరగడం, ఎరువులు, పురుగుమందులు కూలీల ఖర్చులు కూడా రాకపోవడంతో మిర్చిసాగుపై రైతులకు ఆసక్తి సన్నగిల్లుతోంది. నాగార్జునసాగర్ నుంచి సాగునీటి సరఫరా కూడా సంవృద్ధిగా రావడంలేదు. పెరిగిన పెట్టుబడులు, తగ్గిన దిగుబడులతో మిర్చి పంటను సాగు చేయలేక రైతులు ప్రత్యామ్నాయంగా పత్తిపంట వైపు దృష్టిసారిస్తున్నారు.

**భారీగా పెరిగిన పెట్టుబడులు...**

ఎకరం మిర్చి పంట సాగుచేయాలంటే కౌలుతో కలుపుకుని సుమారు లక్షన్నరకు పైగా పెట్టుబడులు అవుతున్నాయి. పొలాన్ని దుక్కి దున్ని విత్తనం వేసిననాటి నుంచి కాయలు కోసి అమ్ముకునే వరకు అనునిత్యం పెట్టుబడి పెట్టాల్సిందే. మిర్చి పంటకు ఐదు విడతలు నీరు పెడితే ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయి. గతేడాది సాగునీరు సక్రమంగా లేకపోవడంతో రెండుమూడు విడతలకే నీరు పరిమితం కావడంతో దిగుబడులు భారీగా తగ్గాయి. ఎరువులు, పురుగుమందులు ధరలు కూడా ఆకాశన్నంటున్నాయి. ఎకరాకు తక్కువలో తక్కువగా 25 నుండి 30 మంది కట్టలు పడుతుండగా సాగుకాలం పూర్తయ్యేలోగా ఎకరా సాగుకు 300 నుంచి 350 మంది వరకు కూలీలు అవసరమవుతారు. ఇంతా కష్టపడి పంట పండించినా దిగబడులు వచ్చేనాటికి గిట్టుబాటు ధర లేకపోవడంతో మిర్చి రైతులు దెబ్బతింటున్నారు.

**పత్తిపంట వైపు రైతుచూపు...**

మిర్చి పంట ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయంగా పత్తిపంట వైపు అడుగులు వేస్తున్నారు. గతేడాది జగ్గయ్యపేట నియోజకవర్గంలో 15 వేల ఎకరాలలో పత్తిపంట సాగుచేయగా, ఈ ఏడాది సాగు విస్తీర్ణం 20 వేల ఎకరాలకు చేరుతుందని వ్యవసాయశాఖ అధికారుల అంచనావేస్తున్నారు. అదేవిదంగా మిర్చిపంట గతేడాది 20,854 ఎకరాలలో సాగుచేయగా ఈ సీజన్‌లో బాగా తగ్గిపోయే అవకాశం ఉందని చెబుతున్నారు. పత్తికి పెట్టుబడి తక్కువగా ఉండడం, రెండో పంటగా మొక్కజొన్న సాగుకు అనుకూలంగా ఉండటంతో పాటు సాగునీరు పెట్టే పని కూడా లేనందున పత్తిపంట సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గ చూపుతున్నారు.

**రెండోపంటగా మొక్కజొన్న..**



మిర్చి పంటపై వస్తున్న నష్టాలను చూసి వెనకడుగు వేయాల్సిన పరిస్థితి. పత్తి పంటపై ఎక్కువ మొగ్గు చూపుతున్నాం. పత్తి పంటకు పెట్టుబడి తక్కువతోపాటు రెండోపంటగా మొక్కజొన్న వేసుకునే వీలుంటుంది. అందుకే పత్తిసాగుకు రైతులు మొగ్గుతున్నారు.

– కొండబోలు శ్రీనివాసరావు, రైతు, మక్కపేట గ్రామం

## ఎమ్మెల్యేను కలిసిన పోలీసు అధికారులు



ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యతో ఏసీపీ రవికిరణ్, జగ్గయ్యపేట సీఐ జానకీరామ్, ఎస్‌ఐలు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను పోలీసు అధికారులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే తాతయ్యకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలియజేసినవారిలో నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్, జగ్గయ్యపేట సీఐ జానకీరామ్, ఎస్‌ఐలు సూర్యభగవాన్, పద్మారావు, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, చిల్లకల్లు ఎస్ఐ సతీష్, పెనుగంచిప్రోలు, వత్సవాయి ఎస్‌ఐలు పి.రాంబాబు, అభిమన్యు ఉన్నారు. అదేవిధంగా పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కూడా ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జగ్గయ్యపేటలోని ఒకటో వార్డులో టీడీపీ నాయకుడు వై.అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. నియోజకవర్గ సమన్వయకమిటీ సభ్యుడు నెట్టెం శివరాం, నాయకులు మైనేని రాధా, కిశోర్, ధూళిపాళ్ల లక్ష్మణరావు, యలమంచి రాఘవ పాల్గొన్నారు.

## నిత్యాన్నదానానికి రూ.10వేల విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం విజయవాడ పట్టణం, మాచవరం డౌన్ ప్రాంతానికి చెందిన మల్లెల రిషికేష్ సాయిశ్రీ రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మ వారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

### వాహనాల తనిఖీ

వీరులపాడు: వాహనదారులు తప్పక లైసెన్సు కలిగి ఉండాలని వీరులపాడు ఎస్ఐ మహాలక్ష్మణుడు సూచించారు. మండలంలోని పెద్దాపురం గ్రామం వద్ద ఆదివారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేకుండా వాహనాలను నడుపుతున్న పదిమందికి జరిమానా విధించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని వాహనచోదకులకు సూచించారు. వాహనాలు నడిపే సమయంలో సరైన ధ్రువీకరణపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించారు.

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



మాట్లాడుతున్న రిటైర్డు డిఫెన్స్ అధికారి శరత్



బహుమతులు అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

కంచికచర్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పేబ్యాక్ టుది సొసైటీ అనే నినాదంతో పేద విద్యార్థులను ఆదుకునేందుకు కృషిచేస్తున్నట్లు అరుంధతీయ సేవాసమితి అధ్యక్షుడు, రిటైర్డు టీచర్ ముండ్లపాటి పోతరాజు తెలిపారు. టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు స్థానిక అరుంధతీ నగర్‌లోని అమితి బాప్టిస్టు చర్చి వద్ద ఆదివారం అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇండియన్ డిఫెన్స్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ విశ్రాంత అధికారి శరత్, రైల్వేశాఖ రిటైర్డ్ అధికారి భాస్కరరావు, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ సాహెబ్, స్వాస్ అధ్యక్షుడు మేడూరి రవికుమార్, ఇన్ఫాం ప్రెసిడెంట్ గద్దం బాపిరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ శేషం తిరుమలరావు పాల్గొని ప్రసంగించారు. వక్తలు మాట్లాడుతూ పేదల విద్యాభివృద్ధికి అరుంధతీ సేవా సమితి కృషి అభినందనీయమన్నారు. పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచినవారికి మొదటి బహుమతిగా రూ.2వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1500, తృతీయ బహుమతిగా రూ.1000 నగదు అందజేసి వారిని దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. 90మంది విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఐలపోగు నాగేశ్వరరావు, కొండూరు నాగేశ్వరరావు, వేల్పుల ప్రభాకర్, నెమలి వాసు, మాడుగుల పాపారావు, మంగలపూడి రమేష్, మార్కపూడి జార్జి విక్టర్, శేషం గోపాలరావు, శేషం వెంకటరావు, ఐలపోగు పుల్లయ్య పాల్గొన్నారు.

## • పెనుగంచిప్రోలుకు పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మ అమ్మవారిని ఆదివారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులు మరో మూడు రోజుల్లో ముగిసి, తిరిగి పాఠశాలలు పునః ప్రారంభంకానుండటంతో భక్తుల తాకిడి బాగా పెరిగింది. భారీసంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ క్యూలైన్లు కిక్కిరిశాయి. వందలాది వాహనాల రాకతో గ్రామంలో ట్రాఫిక్ పెరిగిపోగా, పోలీసులు తగు చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. భక్తులు పాలు,పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. –పెనుగంచిప్రోలు








# దోమలకు ఆవాసాలుగా ఖాళీస్థలాలు

- ఏటా ప్రబలుతున్న వ్యాధులు
- ఆందోళనలో జగ్గయ్యపేటవాసులు
- ముందస్తు చర్యలు చేపట్టాలని వినతి





గౌతమీ స్కూల్ వద్ద మురుగునీరు, ముళ్ల పొదలతో నిండి ఉన్న ఖాళీస్థలం



ముళ్లపొదలతో నిండిపోయిన అయ్యప్పనగర్‌లో ఖాళీస్థలం

జగ్గయ్యపేట అర్బన్ : పట్టణంలో జనావాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయి. ఖాళీస్థలాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు నరక యాతన పడుతున్నారు. పట్టణంలో పలు ప్రాంతాలలో గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల కారణంగా దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. స్థానిక పురపాలకశాఖ వారు తరచూ దోమల మందు పిచికారీ చేస్తున్నప్పటికి కొద్దిరోజులు దోమల వ్యాప్తి ఆగిపోతోంది. తిరిగి కొద్దిరోజులకు దోమలు వృద్ధిచెందుతుండటంతో పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.


**దోమల ఉత్పత్తి కేంద్రాలుగా స్థలాలు..**

పట్టణంలో సుమారు 120 వరకు ఖాళీ స్థలాలు ఉన్నాయి. నివాస గృహాల మధ్య ఉన్న ఈ స్థలాలు ఏళ్ల తరబడి నిర్మాణాలు చేపట్టకుండా ఉండటంతో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారాయి. పరిసర ప్రాంతాల ప్రజలు తమ గృహాల్లోని చెత్త, వ్యర్థాలను ఖాళీ స్థలాలలో కుప్పలుగా పడేస్తున్నారు. దీంతో దోమలు, ఈగలు చేరి అంటువ్యాధులు ప్రబలే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పట్టణంలోని ఐదోవార్డు గౌతమిస్కూల్ వద్ద 2 ఎకరాల విస్తీరణంలో ఉన్న ఈస్థలం దాదాపు 29 ఏళ్ల నుంచి కోర్టు వివాదంలో ఉంది. దీంతో 3, 4,9వ వార్డులైన చింతలతోపు, వెంకటగిరిగుట్ట, సీతారామపురం, పాతవెంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంతాల నుంచి ప్రవహించే మురికినీరంతా ఈ ఐదోవార్డులోని ఖాళీస్థలంలోకే వదులుతుండటంతో ఈప్రాంతమంతా పెద్దచెరువులా తయారైంది. దోమలకు ఆవాసంగా మారిపోయింది. వాటిలో ఆయిల్‌బాల్స్, రోడ్లపై పాకింగ్‌స్ప్రేలు మున్సిపల్ అధికారులు చేయించినప్పటికి ప్రయోజనం కనిపించటంలేదు.

**ముందస్తు చర్యలు తీసుకోవాలి..**

వర్షాకాలం వచ్చిన ప్రతిసారి పట్టణంలో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇప్పటికే వర్షాలు ప్రారంభం కావడంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గతేడాది పట్టణంలో వైరల్ జ్వరాలు, డెంగ్యూ ప్రబలడంతో స్థానిక పురపాలకసంఘం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సకాలంలో స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఇదే పరిస్థితులు మరలా పునరావృతం కాకుండా వెంటనే యుద్ధప్రాతిపదికన ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంది. గతేడాది ఇదే సీజన్‌లో డెంగ్యూ వ్యాధితో ఓ మున్సిపల్ కంట్రాక్టర్ మృతిచెందిన విషయం పాఠకులకు విదితమే. మున్సిపల్ అధికారులు స్పందించి ఆయా ఖాళీస్థలాల్లో మురుగునీరు నిల్వకుండా వాటి యజమానులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అప్పుడే ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమానికి అర్థం, పరమార్థం ఉంటుందని పేర్కొంటున్నారు.


**ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలి**



ఖాళీస్థలాల యజమానులచే ఆయా స్థలాలను శుభ్రం చేయిస్తే దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయి. ఖాళీ స్థలాల్లో మురుగునీరు, కంపచెట్లు లేకుండా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– బొక్కా ప్రసాద్, అయ్యప్పనగర్

**సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాం..**



ఎర్రకాలువ, వేపలవాగుతోపాటు గృహాల మధ్య ఖాళీ స్థలాలలో దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్, దోమల మందును పిచికారీ చేయిస్తున్నాం.పట్టణంలో ఉన్న ఖాళీస్థలాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఆయాస్థలాల యజమానులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. జరిమానాలు కూడా విధిస్తున్నాం. తగిన చర్యలు తీసుకుని మురుగునీటి సమస్యను పరిష్కరిస్తాం.

– సీహెచ్.నాగమల్లేశ్వరరావు, జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్

## రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి

**వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కేఎంఏ సుభాన్**



సమావేశంలో మాట్లాడుతున్న కేఎంఏ సుభాన్

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కేఎంఏ సుభాన్ అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వెల్ఫేర్ పార్టీ కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో కేఎంఏ సుభాన్ మాట్లాడుతూ రాజ్యాంగ, ప్రజాస్వామ్య, సెక్యులర్ ఆకాంక్షలను నెరవేర్చాలని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను కేంద్రం నుంచి సాధించాలని చంద్రబాబుకు సూచించారు. రాష్ట్ర ప్రజల కలల పంట పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు రాబట్టాలన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, కేజీ బేసిన్‌లో రాష్ట్ర వాటాను సాధించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం దళితులు, మైనారిటీలు, ఓబీసీలకు అందించే స్కాలర్‌షిప్స్ పునరుద్ధరణ కోసం వారి ఆర్థిక, విద్యా, వైద్య, ఉద్యోగ సాధనలో సహకారం అందించాలన్నారు. మత సామరస్యం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కృషి చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గంలో మైనారిటీలకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి జానీ, కార్యదర్శులు సత్యనారాయణ, హకీమ్, మున్వర్, కరీమ్, జమాన్, ఇనాయతుల్లా, కోశాధికారి మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి సహకరించాలి



జమీదగ్గుమిల్లి(పామర్రు): గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న గంగానమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి దాతలు మరింగా సహకరించాలని సర్పంచ్ కూనటపరెడ్డి చంద్రశేఖర్‌రావు, గ్రామస్తులు పేర్కొన్నారు. మండలంలోని జమీదగ్గుమిల్లిలో ఏర్పాటు చేసే గంగానమ్మ ఆలయంలో గంగానమ్మ విగ్రహం కొనుగోలుకు గ్రామస్తులు భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ఇంటింటికీ తిరిగి విరాళాలను ఆదివారం సేకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆలయాన్ని సుమారు రూ.35 లక్షలతో నిర్మాణం పనులు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామస్తుల నుంచి వచ్చిన విరాళాలతోనే అమ్మవారి విగ్రహం కొనుగోలు చేసి ఆలయంలో ప్రతిష్ఠించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ సభ్యులు, గంగానమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులుపాల్గొన్నారు.

### పేదలకు సాయం చేయడమే బక్రీద్

నున్న(విజయవాడరూరల్): పేదలకు సహాయం చేయడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశమని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. ఆజాద్ ముస్లిం కమిటీ ఏపీ 31వ నెల సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం బక్రీద్ పండుగను పురస్కరించుకొని నున్న టీచర్ కాలనీ మక్కా మసీద్ వద్ద పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ ఆర్థికపరమైన సంతోషాలతో ఉన్న కుటుంబాలు బక్రీద్ సందర్భంగా ఖుర్బానీ ఇవ్వాల్సిన బాధ్యత ఉందని, అదే పేదలకు సహాయం చేయడమన్నారు. మనతో పాటు పేద కుటుంబాలను సహాయం చేసి ఆదుకోవడమే ఆజాద్ ముస్లిం కమిటీ విధానమన్నారు. ప్రతి నెలా ఒక్కొక్క నియోజకవర్గంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న వారికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ, సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్, గన్నవరం నియోజకవర్గం ఉపాధ్యక్షుడు మస్తాన్ వలీ, రాష్ట్ర కమిటీ సభ్యులు అబ్దుల్ రహీం, నున్న గ్రామ అధ్యక్షుడు మహబూబ్ బాషా, ఉపాధ్యక్షుడు ఎండీ గౌస్, కార్యదర్శి సుభాని, సెంట్రల్ నియోజకవర్గం కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

### దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం పలువురు చిన్నారులు నృత్య నీరాజనాలను అర్పించారు. విజయవాడకు చెందిన ఆర్‌ఎస్‌వై.రాజేశ్వరికి చెందిన రాజేశ్వరి నృత్యనికేతన్‌కు చెందిన చిన్నారులు ఆంధ్ర నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శన అనంతరం ఆలయ అధికారులు చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.